# అపస్వరాలు

-బుర్రా లక్ష్మీనారాయణ



"ఇప్పుడెందుకు? మళ్లీ బయటకు తీస్తున్నారు 'దాన్ని', అసలే ఇల్లు యిరుగ్గావుంటే"? అన్న స్వగతం లాంటి ప్రశ్న, తగలాల్సినచోటే తగిలింది, మరది శరమాయె.

ముందుగా స్పందించిదలచింది మాత్రం 'అహం'. పైగాదానికి మగ వాసన కూడా కలిస్తే...అందుకే దశాబ్దంన్నరపైగా అలవాటైన 'మౌనం' జోకొట్టింది.

జవాబు మౌనం! మరింత మౌనం!! ఆ ప్రశ్న సంధించింది మరెవరో కాదు నా భార్య, పేరు వాగ్దేవి.

నిజానికి నేనంటున్న 'మౌనం', ఆవిగారి దృష్టిలో 'మొండితనం'.

రంగుటద్దాలు పొదిగిన రమణీయకత 'సరిగమల' సంసారంలో 'పదనిసల' ముక్తాయింపు.

* * *

నాకు వీణన్నా, వీణా నాదమన్నా చాలా యిష్టం! వీణ వాయించడం రాకపోవడం కారణమనుకుంటా!

నాకు వీణంటే యిష్టమని కాళ్యాణిని చూసాక తెలిసిందా? లేక కళ్యాణి పరిచయంతో వీణమీద ఆసక్తి కలిగిందా? ఏది ముందు! ఏది వెనుక!

సరే! ఆ పరిచయం, కలలా, జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయిన తరువాతనే కదా, కనీసం వీణ రాకపోయినా, వాగ్దేవి పేరున్న ఈమె గొంతు వీణలా, శృతి మధురంగా, వీనులవిందుగా వుంటుందనుకున్న నా అంచనా తప్పని, ఆ మూడు రాత్రుళ్ళలోనే తెలిసిపోయింది.

అప్పట్నించే అనుకుంటా,
మౌనరాగాన్ని ఆలపించడం,
మౌనాన్ని ఆరాధించడమూ,
మౌనాన్ని ఆత్మీకరించడమూ,
తదితరాలన్నీ అనుశృతంగా
అవసరమయ్యాయి.

TO BE FRANK TO
SAVE OUR SKIN, YEAH

* * *

ఎప్పటి కళ్యాణి, ఆరాగమంతపాతదా? ఆ భావమంత నిత్యనూత్నమయినదా? ఆ ఆలాపనంత శృతి పక్వమయిన సుస్వరస్వర మాధుర్యమా? అసలా తలంపే పొయిటిగ్గా వుంటుందేమిటి.

ఇప్పటికీ, ఆ గొంతూ, ఆ రాగాలాపన సుదూర తీరాల్నించి నా చెవుల్ని సోకుతున్నంత సున్నితమైన భావావేశం, చిరుస్పందన, మెల్లగా శరీరమంతా పాకిన అనుకంపన, ఏమిటీ వింత అనుభూతి.

ఆతాదాత్మ్యంలో నన్ను నేను ఏ కొద్ది క్షణాలైనా మరువగల్గినపుడు వోహ్!

అద్భుతం! అమరలాలిత్యం!

ఆ పాత మధురం! ఆ ఆలాపన!

ఆమె! ఆమె గానం! ఆమె సమక్షం, సమస్తం, ఆమె సాన్నిహిత్యం....ఫ్చ్!

* * *

ఇంతకీ ఇరుగ్గా వున్న యింటిలో నేను తీసానంటున్నది, ఇంటికి అడ్డంగా వుందన్నది, అది, లేదా 'దాన్ని' అని ఎంతో ధూష్ణీకార, ధిక్కార స్వరమున ఆవిడగారు ప్రస్తావించినది "వీణ"!

తొలినాళ్ళలో గొణుగుడుగా, అదేస్వగతంలా, తరువాత్తర్వాత చిన్నపాటి అభ్యర్ధన గొంతులో మిళాయించిన ఆజ్ఞాపనలా అంటే 'రాయల్ వుయ్' అంటామే అటువంటిది. పునఃపునః మా సమక్షంలో ప్రవచించే వాగ్దేవికి, నా సమాధానం, కేవలం మౌనం.

అందాకా, చిక్కటి, చిక్కని నామౌనానికి దొరికిన, అంచక్కని తరుణోపాయం, నేచేయించదలచిన డబల్‌కాట్ మంచంలో ఆ వీణను అమర్చుకోవాలనుకోవడం, ఆలోచన వచ్చిందే తడవుగా నా భుజం నేను తట్టుకున్నా అభినందన పూర్వకంగా, కానీ, ఈ మాటే కార్పెంటర్‌తో అంటే నన్ను వాడుచూసిన చూపు ముందు ఫ్చ్! ఎవరు ఏమనుకుంటే ఏంగాని.

నా ఆలోచన ఆచరణ రూపం దాల్చిన తరువాత, ఆవిడగారి కళ్ళల్లో కనిపించిన ఏదో రిలీఫ్‌లాంటి, ఏద్తైతేనేం...అడ్డుతొలగిందన్న భావంతోపాటు చిన్నపాటి మందహాసం, అది నాపై ప్రయత్నంగా వొలికిన అభినందన తొలకరి వానా లేక తనమాట నెగ్గిందన్న విజయ విలాసమా? స్పష్టంగా తెలీలేదు.

అప్పుడప్పుడు ఆ వీణను బయటకు తీసి కచేరీ యివ్వబోయేముందు వైణికుడు చేసే హడావుడి చేస్తాను. పైగా ఏదో తెలీని గొప్పసంతృప్తితో మునివేళ్ళపై, జ్ఞాపకాల స్వరాలను మీటుతూన్నంత ఆత్మానందంతో, కచేరీ అయిన తదనంతరం, అభినందన పూర్వకంగా ప్రేక్షకుల స్టాండింగ్ ఒవేషన్‌ని ఫీలవుతూ...అలా అనేకంటే చాలా జాగ్రత్తగా శుభ్రంచేసి, కాసిని జ్ఞాపకాలను కలబోసుకుంటానంటే సబబుగా వుంటుందేమో.

* * *

అందాకా నా గతాన్ని చూచాయిగా ఆకర్ణించుకున్న శ్రీమతి వాగ్దేవికి అప్పటివరకూ నేను కేవలం వీరవీణాభిమానినేనన్న నమ్మకానికి 'కళ్యాణి' ముక్తాయింపుతో, నా 'మౌనానికి' మరిన్ని అర్ధాలు స్పష్టంగా స్ఫురించసాగాయి. అప్పటివరకూ వాగ్దేవి చేతిలో కేవలం వీణనుంచితే ఎంతో బాగుంటుందనుకుంటున్న నేను, కరవాలము చేతపట్టిన వీరవాగ్దేవిని కూడా యీ జన్మలోనే సందర్శించి, తరించి, జన్మసాఫల్యతనొందిన 'జీవి' నయ్యాను కదా! అనిపించింది.

* * *

నాలుగైదు వాటాలున్న కాంపౌండులో మేడమీది రెండువాటాల్లో, అప్పుడు, ఒక దాంట్లో, నేనుండేవాడిని. కింది వాటాల్లో ఎవరెవరు ఉంటున్నారో నాకు తెలీదు. కానీ, నన్ను గమనించే



2

కొన్ని జతల కళ్ళను, అందులో సగం లోసగానికి చిర్నవ్వులు చిందించేంత పరిచయం నా ఉనిక్కి కలిగిందనుకోవడం అప్పట్లో గొప్ప ఎఛీవ్‌మెంటు.

ఆ తృప్తే, ఆ మట్టిరోడ్లపై గొప్ప ధీరోదాత్తంగా నన్ను నడిపించేది.

ఆనమ్మకంలో ఉన్న నన్ను గొప్ప ఆరాధన, ఆత్మీయతలతో నా మనసును స్పృశించినది 'కళ్యాణి'. ఆమె, ఆమె ఆలాపన, సంగీత సాధన, ఆవేకువవేళల అలసటతో సుషుప్తి వల్మీకంలో వున్న నన్ను అక్కున చేర్చి సేదతీర్చిందీ, ఆ భూపాలమే.

అప్పటికి నాకు పరిచయమయినవి, కొన్ని జతల కళ్ళు, మరిన్ని చిర్నవ్వులూ, యిప్పుడు యీ గొంతూ...గొప్ప ఆబ్‌స్ట్రాక్ట్‌గా అనిపించింది.

*    *    *

వంట అయినట్లయింది, వాగ్దేవి చేసే శబ్ద సంకేతాలు వినవస్తున్నాయి కిందినుంచి. మరికాస్సేపట్లో...ప్రకటన....కాబోలు.

*    *    *

ఆ మట్టిరోడ్డు మీద నే చూసిన కారూ, దాంట్లోంచి పల్చటి రావాకు రంగు చెప్పులూ, ఆపై పచ్చటిపాదం, దానికి అమరిన బంగారుపట్టీ, ఆపై తెరచిన కారుకిటికీ అద్దంమీద వాలిన తుమ్మెదలు వరుసగా, వాటిని ఆమె చేతివేళ్ళుగా గుర్తించగలగటం ఒక అనుభూతి. అంతటి సున్నితమైన చేతివేళ్ళను చూడడం అదే ప్రథమం.

ఆ తర్వాతనే కదా! ఆ కళ్ళు... సింవాచెలంలో దొరికే ఆకుసంపెంగంత...ఆ కన్నూ...ఆపై ఆ ఆకుసంపెంగ రేకునే అతికించినట్లున్న పెదవులు, సన్నగా విచ్చుకున్నవి....మొత్తానికి ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రం కేన్వాస్‌పై బాగానే కుదిరింది.

*    *    *

"మీ "కచ్చేరి" అయితే భోజనం చేద్దాం" వాగ్దేవి ప్రకటన. కచ్చేరీ అని నొక్కి వక్కాణించడంలోని సీరియస్‌నెస్ గమనించాను మౌనంగానే.

*    *    *

ఆ రాత్రి మేడమీద పచార్లు చేస్తున్న నన్ను మళ్లీ ఆ జ్ఞాపకం తాలూకు గొంతే....ఇంతకూ, ఇంతక్రితం కారులోంచి దిగిన చిన్నదాని గొంతేనా అని మొదటిసారి అనిపించింది. వెంటనే ఏదో తెలీని ఉద్వేగంతో, శరీరం వణికింది, అలా అయితేనే పరిపూర్ణత్వం సిద్ధించినట్లవుతుందన్న భ్రాంతిలాంటి, భావంలాంటి, ఆశలాంటి... ఏదీ తెలీని ఆలోచన ఫలితం...అలసట సుషుప్తి వల్మీకంలో మళ్లీ నేను...

**"రావాలనిపించింది, వచ్చాను,**
**ఇప్పడు పోవాలనిపించింది పోతున్నాను" అన్న గొంతువిని, 'విశ్వతేజ' ఆఫీసులో మేగజైన్ తీవ్రంగా చదూతున్న నేను దిగ్గున తెలెత్తి ఆ మాట విన్నదిశగా చూసాను తలతిప్పి.ఆ ఆఫీసులో మిత్రుడు ఇంజనీరు రవిని కలవడానికి వెళ్ళాను ఆ మధ్యాన్నం.**
**ఏదో దెబ్బతిన్నట్టె చరచరా వెళ్ళిపోయింది, ఆమె.... ఆమె కళ్యాణి.**

నేనేనా...ఎప్పటిదాకా అంటే భూపాలం వినబడేంతవరకూ...! ఆ గొంతుపేరు 'కళ్యాణి', నేను విన్న ఆ స్వరార్చన ఉదయంలో ...మీకు వీణొచ్చా అనడుగుదామనుకొని...కళ్యాణికి వీణొచ్చా అనడగడమూ, సరస్వతిని మీరెందాకా చదూకున్నారూ అనడగడమూ, హిందోళంలో రిషభం వేయడంలా వుంటుందనిపించి, నన్ను నేను సంభాళించుకున్నాను.

"ఇప్పుడయితే యిన్నిన్ని కబుర్లు చెబుతున్నావుగానీ, పెళ్ళయ్యాక, గొప్ప 'మౌని'వి అవుతావేమో,"అంది కళ్యాణి కళ్ళతో భయాన్ని అభినయిస్తూ, ఆ సాయంత్రం, గుండెలపై రెండుచేతులూ వేసుకుని!

"తప్పదు" అంటూ ఆమెకేసి చూసాను.

నీ సమక్షంలో, నీ గొంతువింటూ, నీ వీణాలాపనవింటూ, మౌనంగా ఉండగల్గడం గొప్పవరమే కదా, అనుకున్నాను.

"ఆ"అంది, నేన్నది అర్థమయిందనుకుంటా, తదియనాటి వెన్నెల వొంటిరాయి ముక్కుపుడకపై పడి వింతగా మెరుస్తూంది.

*    *    *

"మీరొస్తే పడుకోవచ్చు, నాకు నిద్రొస్తోంది" అంది శ్రీమతి. ఆ వెన్నెలవేళ మేడమీది వొంటరి గతానికి వాస్తవం రగ్గు కప్పుతూ.

*    *    *

ఏమయితేనేం, మా దారులు వేరయిపోయాయి, ఏదో కచేరీ యిస్తున్నప్పటి వార్తో, ఫోటోనో, చూడ్డం తప్ప ఆమె సంగతులు దాదాపు ఏం తెలీలేదు, వినబడలేదు.

*    *    *

"రావాలనిపించింది, వచ్చాను,

ఇప్పుడు పోవాలనిపించింది పోతున్నాను" అన్న గొంతువిని, 'విశ్వతేజ' ఆఫీసులో మేగజైన్ తీవ్రంగా చదూతున్న నేను దిగ్గున తెలెత్తి ఆ మాట విన్నదిశగా చూసాను తలతిప్పి.

ఆ ఆఫీసులో మిత్రుడు ఇంజనీరు రవిని కలవడానికి వెళ్ళాను ఆ మధ్యాన్నం.

ఏదో దెబ్బతిన్నట్టె చరచరా వెళ్ళిపోయింది, ఆమె....ఆమె కళ్యాణి.

సరిగ్గా ఇరవైఏళ్ళ క్రితం నేను విన్న ఆమె గొంతులోని, ఆ లాలిత్యమేదీ, ఈ కఠోర మార్మికత ఎలా అలవడిందీ అనిపించింది, ఎవరితో అలా అన్నదో కూడా నేను గమనించలేదు. నిజానికి ఆలోచించలేదు కూడా అలా.

*    *    *

"ఇది చదివి చెప్పు" అన్నా శేఖరంతో ఆ మధ్యాన్నం, అవుట్‌హౌస్‌లో బీర్ తాగుతూ. పదినిముషాల అనంతరం ..."దానికి ముగింపేదోయి విశ్వనాధం"అన్నాడు మాట తడబడుతుండగా.

చిన్నగానవ్వి ఫరవాలేదే, అన్నట్లు చూసాను.

"అవును చిరంజీవి" ఈ కథకు ముగింపు ఇవ్వొద్దూ" బతిమాలుతున్న ధోరణితో శేఖరం అన్నాడు.

శేఖరం ఇక్కడే ఇన్‌కంటేక్స్ ఆఫీసులో చేస్తున్నాడు. బీరుతప్ప మరి అది అమృతమైనా సరే, ముట్టడు, తాకడు, తాగడు. రెండు బీర్లు పట్టించిన అనంతరం విచిత్రమైన పేర్లతో సంబోధించడము అనేది వాడికి అరడజను బీర్లు పట్టించినంత ఈజీ.

మరో బీరు గ్లాసుల్లో పోస్తుంటే శేఖరం, జేబులోంచి ఒక కాగితంతీసి యిచ్చాను.

"ఓహో! ముగింపుయిదా బాల్‌కిషన్"అంటూ గ్లాసులోకి బీర్‌ని ఒక్కగల్ప్ పట్టించి, చేతిలోకి తీసుకున్నాడా కాగితాన్ని.

ఎవరిని ఎడ్రసు చేసుందో తెలీదు ఆ కాగితం, కానీ..."ఆ మధ్యాన్నం! మిమ్మల్ని ఆఫీసులో చూసాక యిదిరాస్తున్నాను. నా గొంతు విన్నంతనే మీరు చివుక్కున తలెత్తడంతో మిమ్మల్ని చూసాను, సారీ! చది:

నేనన్న ఆ మాట మిమ్మల్ని, ముఖ్యంగా నిన్ను చాలా బాధిస్తుందని తెలుసు, కానీ, "పరిస్థితులంటే" నువు బహుశానన్ను అసహ్యించుకుంటావనుకుంటూ! ఎస్! నాలో వున్న కళనిగాక, ఆ కళద్వారా తనవున్నతిని కోరుకునే మగాడిని, భర్తగా చూళ్ళేకపోయాను, అందుకే...యిదుగో యిప్పటివరకూ...

నా గతాన్ని, ముఖ్యంగా, నీ జ్ఞాపకాలనూ, సమాధిచేసి, అలా అనుకున్నాను. నిన్ను చూసేంతవరకూ,...ఇక్కడ బతుకుదామనుకున్నాను. ప్చ్! సరే! కానీ ఒక్కమాట!

"మళ్ళీ నువ్వు నన్ను చూడాలని ఇక్కడకు రావద్దు". నీకు తెలుసు నేను 'జాలిపడటాన్ని సహించలేనని, కొంతకాలమైనా ఇక్కడ బతకనీ, అర్థం చేసుకోగలవనుకుంటా'. అని సంతకంలేని ఆ కాగితాన్ని చదివాడు శేఖరం.

ఇదేనా ముగింపు అన్నట్లుచూసాడు, ఆ కళ్ళల్లోని ఎరుపుజీరలో నన్ను ప్రశ్నించేకొరడాలను ఝుళిపిస్తూ!

"అదే ఆఖరు, మరలా ఆమెని కళ్యాణిని చూడ్డంగానీ, కలవడానికినిగానీ నేను రవివాళ్ళ ఆఫీసుకు వెళ్ళలేదు."

"అలాని, వీణ కూడా నా దగ్గరలేదు తెలుసా"అన్నాను, శేఖరం వేయబోయే ప్రశ్నను గ్రహించినట్లుగా.

"అదెలా సంజయా" అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ.

"అదంతే మిత్రమా" అన్నాను మరో ప్రశ్నకు అవకాశమీయకుండా శేఖరంతో.

"ఇది కూడా ముగింపుకాదు సాహెబ్సింగువర్మా" అన్నాడు.

"అవును నాకు తెలుసు, ఇదంతా జరిగి అయిదేళ్ళయిందన్న సంగతి తెలుసా" అవునన్నట్లుగా తలూపాడు శేఖరం.

"అంటే అయిదేళ్ళయింది, మీ అమ్మాయి మాధురికి సంగీతం నేర్పుతున్న గురువు కళ్యాణి అని నాకు తెలుసా?

ఆమె దగ్గరున్న వీణ....

మూడు రోజుల కిందట మీ అమ్మాయి మాధురికి సంగీతం నేర్పుతున్న కళ్యాణిని మీ ఇంట్లో చూసి...

శేఖరం నే చెప్తున్నది విన్నాడో లేదోగానీ, సోఫాలోంచి గురక వినబడింది, రిహార్సిల్ అవసరంలేని సైరన్‌లో....!

▲